








## ఆత్మకూర్.ఎస్ మండలంలో చిన్నబోయిన 9 చెక్‌డ్యామ్‌లు

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలంలోని 2019లో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 9 చెక్ డ్యామ్‌లు నిర్మించింది. ఒక్కో చెక్ డ్యామ్ కింద 300 ఎకరాల ఆయకట్టుకుపైగా సాగయ్యేది. దాదాపు 3వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ద్వారా నీళ్లు ఇవ్వడంతో చెరువులన్నీ నిండటంతోపాటు చెక్‌డ్యామ్‌ల్లోనూ పుష్కలంగా నీటి నిల్వ ఉండేది. దీంతో నాలుగేండ్లుగా రెండు పంటలకు పుష్కలంగా నీరు అందింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నీళ్లు లేక మండలంలోని చెక్‌డ్యామ్‌లు అన్నీ ఎండిపోయాయి. గతంలో ఏప్రిల్, మే నెలల్లోనూ నిండుగా నీళ్లు ఉన్న ఏపూరు గ్రామ పరిధిలోని చాకలిబండ చెక్ డ్యామ్‌లో ఇప్పుడు రాళ్లు తేలాయి. దీని పరిధిలోని వరి పైర్లు పొట్ట దశలో ఎండిపోతున్నాయి. చాలా చోట్ల ఇప్పటికే పంటలను పశువుల మేతకు వదిలి పెట్టారు.

### • ఎండిన వరి.. గొర్రెలకు సరి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రోళ్లపాడు ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఆ ప్రాజెక్టును నమ్ముకొని ఆయకట్టు రైతులు 120 ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ ప్రాజెక్టు తూము గేటు నుంచి నీళ్లు లీకవడం.. ప్రభుత్వం వెంటనే స్పందింకపోవడంతో నీళ్లు అందక 80 ఎకరాలకు పైగా పొలాలు నెర్రెలు వారాయి. దీంతో తమ పొలాల్లో పశువులను మేపుతున్నారు. –ఇల్లెందు, మార్చి 12

### • మక్కరైతు గోస..



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో ఎండిపోయిన మక్కజొన్న పంట ఇది.. సకాలంలో నీరందకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో దిగుబడి రాక అన్నదాత ఆందోళనలో పడ్డాడు. ప్రభుత్వం సాగునీరందించేందుకు చర్యలు తీసుకోకపోవడమే తమ పంటలు ఎండిపోవడానికి కారణమని అక్కడి రైతాంగం మండిపడుతున్నది.

### • కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ కరువు



ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం బీక్యాతండాలో ఎండిపోయిన పంటలను బుధవారం పరిశీలించారు. సర్కారు తీరుపై మండిపడ్డారు. ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. –మోతె, మార్చి 12

### బొట్టు.. బొట్టు.. పంటకు ఒడిసిపట్టు



స్వర్ణ ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు 1400 ఎకరాలు ఉండగా.. 400 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. స్వర్ణ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువలతో పాటు జౌలినాల ద్వారా పంటలకు నీటిని వదులుతారు. స్వర్ణ ద్వారా నీటిని వదలకపోవడంతో చివరి ఆయకట్టుకు రావడం లేదు. నిర్మల్ మండలం తల్వేద శివారులో జౌలినాల ద్వారా వచ్చిన నీరు గుంతల్లో నిలువగా మోటర్ ద్వారా రైతు సుంచు రాజు, ఆయన స్నేహితుడు పంటలకు పారించుకుంటున్నారు. –సోన్, మార్చి 12





### ఆకేరు సాక్షిగా అవస్థలెన్నో..

ఐదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా మహబూబాబాద్ జిల్లాలో ఆకేరువాగు ఎండిపోవడంతో సాగు చేసిన వరి పొలాలు కాపాడుకునేందుకు అన్నదాత అరిగోస పడుతున్నాడు. నర్సింహులపేట మండలంలోని జయపురం శివారులో ప్రవహించే ఈ వాగులో నీరు లేకపోవడంతో చేతికి వచ్చిన వరి పంటను కాపాడుకునేందుకు జేసీబీల సహాయంతో గుంతలు తీయిస్తూ నీటికోసం రైతన్న తిప్పలు పడుతున్నాడు. గంటపాటు నీరు వస్తే మరోగంట ఆగాల్సి వస్తున్నదని, దీంతో తమకు తిప్పలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –నర్సింహులుపేట, మార్చి 12





### అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతకు శాపం

నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులోని బెల్లాల్ చెరువు నుంచి పట్టణానికి తాగు, పంటలకు సాగునీరు అందిస్తారు. సాగునీరు ప్రవహించే శర్బత్ కెనాల్ మున్సిపల్, నీటిసారుదల శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్తతో నిండిపోయింది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు బండారి చిన్న గంగాధర్ స్వయంగా రంగంలోకి దిగారు. కెనాల్‌లోకి దిగి చెత్తను తొలగించారు. –శక్కర్‌నగర్

### • 730 అడుగులు తవ్వినా చుక్కనీరు రాలే..



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో 250 నుంచి 300 వరకు బోరుబావులను ఈ రెండు నెలల్లో తవ్వించారు. ఒక్కో బోరుబావికి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతున్నది. కన్గుట్టకు చెందిన మునిగెల రమేశ్ 730 అడుగుల లోతు వరకు బోరు తవ్వించినా చుక్క నీరు రాలేదు. దీంతో పంటలను పశువుల మేతగా వదిలేస్తున్నారు. –బోథ్, మార్చి 12

# ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు ప్రశ్నార్థకం!

**ఎండుతున్న పంటలు.. వట్టిపోతున్న చెరువులు**

- గతంలో పుష్కలంగా నీరు.. నేడు నీరందించలేని దుస్థితి
- చెరువులు నింపే ప్రక్రియపై ప్రభుత్వం తీవ్రనిర్లక్ష్యం
- అడుగంటిన వేలాది చెరువులు
- కాంగ్రెస్ సర్కారు ప్రణాళికాలోపం
- పాతాళానికి భూగర్భ జలాలు
- లక్షలాది ఎకరాలకు ముప్పు
- అన్నదాతల్లో ఆందోళన
- కాళేశ్వరం నీరు ఎత్తిపోయడమే మార్గమని నిపుణల సూచన

కరీంనగర్ ప్రతినిధి, మార్చి 12 (నమస్తే తెలంగాణ)/జగిత్యాల (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుకు వంకలు పెట్టిన ఈనాటి కాంగ్రెస్ సర్కారు.. ఎస్సారెస్పీ నీటిని సైతం సరిగా వాడుకోలేకపోయింది. ప్రణాళికాలోపంతో ఎస్సారెస్పీ నుంచి వందకు పైగా టీఎంసీలను సముద్రం పాలుజేసింది. ఫలితంగా ఎస్సారెస్పీ చివరి ఆయకట్టులో వేలాది ఎకరాల్లో పంటలు ఎండుముఖం పట్టాయి. దీని పరిధిలోని దాదాపు 80 శాతం చెరువులు అడుగంటిపోయాయి. కండ్లముందే పంటలు ఎండిపోతున్నా, వాటిని కాపాడేందుకు మార్గాలున్నా కాళేశ్వరంపై కక్షసాధింపు చర్యలతో ప్రభుత్వం ముందుకెళ్తున్న తీరుపై రైతాంగంలో తీవ్ర



వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. సర్కారు తేరుకపోకపోతే మరో వారం, పదిరోజుల్లో ఎండిపోయే పంటలు వేలాది ఎకరాలు దాటి.. లక్షలకు చేరే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో చెరువులను కాపాడాలన్నా, చివరి ఆయకట్టుకు నీరు అందాలన్నా ప్రభుత్వం ముందున్న ఏకైక మార్గం.. కాళేశ్వరం నీటిని ఎత్తిపోయడమేనని నిపుణులు చెప్తున్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో ఎండుతున్న పంటలు, ప్రభుత్వ వైఫల్యంపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

### ఆయకట్టు పరిధిలో 2,142 చెరువులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజీ–1, 2 కింద నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో 2,142 చెరువులు ఉన్నాయి. ఎస్సారెస్పీ ఆయకట్టేతర పరిధి మండలాల్లోనూ కొన్ని చెరువులు ఉన్నాయి. కొన్నిచోట్ల ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర ఐడీసీ స్కీమ్‌ల ద్వారా నింపే చెరువులూ ఉన్నాయి. ఈ చెరువులన్నింటినీ కేసీఆర్ ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం నింపుతూ వచ్చింది. ఎస్సారెస్పీలో నీటి సౌలభ్యం ఉన్నప్పుడు, ప్రాజెక్టు నీటిని డిస్ట్రిబ్యూటరీల ద్వారా విడుదల చేసి, తూముల ద్వారా చెరువులను నింపుతూ వచ్చింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎస్సారెస్పీలో నీటి వనరులు తగ్గిపోతే, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వరద కాలువతో పాటు, ఇతర కాలువలను ఆధారంగా చేసుకొని, నీటిని ఎగువకు తీసుకొచ్చి, చెరువులను నింపుతూ వచ్చింది. చెరువులు, కుంటలతో పాటు ప్రాజెక్టుల కాలువల్లోనూ రిజర్వాయర్లలాగా ఏడాది పొడవున నీటిని నింపి ఉంచడంతో వరదకాలువతోపాటు ఇతర కాలువల, చెరువుల పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరుగుతూ వచ్చాయి. 2018 కంటే ముందు ఆయకట్టేతర మండలాల్లో సగటున 14 నుంచి 20 మీటర్ల లోతున భూగర్భజల మట్టాలు ఉండగా, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం, ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకాలతో భూగర్భజలాలు సగటున 4 నుంచి 5 మీటర్ల పైకి ఉబికి వచ్చాయి. చెరువుల పరిధిలోని ఆయకట్టు భూమికి సక్రమంగా సాగునీరు అందుతూ వచ్చింది. చెరువుల కింద సైతం వేల ఎకరాల ఆయకట్టు సాగయింది. ఒక్క జగిత్యాల జిల్లా పరిధిలోనే 1,125 చెరువులు, 96 కుంటల కింద 59 వేల ఎకరాల పైచిలుకు భూమి సాగు అయిందంటే సాగులో చెరువులు ఎంత కీలకంగా వ్యవహరించాయో అర్థం చేసుకోవచ్చు.

### మళ్లీ జలకళను కోల్పోతున్న చెరువులు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో నీటి లభ్యత గతం కంటే ప్రస్తుతం అధికంగా ఉన్నప్పటికీ నీటి పంపిణీ యాజమాన్యం విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్, అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. 285 టీఎంసీల నీరు వస్తే, 104 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలేశారు. నిరుడు జూన్, జూలైలో ప్రాజెక్టు నుంచి నీటిని బయటకు వదిలిపెట్టనే లేదు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున నీరు రావడంతో ప్రభుత్వం ఆదరబాదరాగా నీటిని వదిలిపెట్టింది. ఈ క్రమంలో 100 టీఎంసీల నీరు వృథాగా వెళ్లిపోయింది. గోదావరిలోకి వదిలిన నీటిని జాగ్రత్తగా పంపిణీ చేసి, ప్రాజెక్టు పరిధిలో ఉన్న 2,000కు పైగా చెరువులను నింపుకునేందుకు అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం పనిచేయకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. జనవరి నెలాఖరు, ఫిబ్రవరి నెల మొదటి వారంలోనే 60 శాతం చెరువులు అడుగంటిపోయాయి. డిసెంబర్‌లో ఎస్సారెస్పీలో నీటి వనరులు ఉన్నప్పటికీ డిస్ట్రిబ్యూటరీలు, వరద కాలువ ద్వారా చెరువులను ప్రభుత్వం నింపలేకపోయింది.

### ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోనూ..

ఎల్లపల్లి ప్రాజెక్టు పరిధిలోని చెరువులు సైతం అడుగంటిపోతున్నాయి. ప్రభుత్వ ప్రణాళికాలోపం వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది.

### లక్ష ఎకరాలు ఎండిపోవడం ఖాయం?

ఎస్సారెస్పీ ఫేజ్–2 కింద సూర్యాపేట జిల్లా పరిధిలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో కాలువలు, చెరువులు, కుంటల ద్వారా మొత్తం 2.66 లక్షల ఎకరాలకు నీరందించాల్సి ఉన్నది. కేసీఆర్‌తోనే 2018లో ఈ జిల్లాకు తొలిసారి నీళ్లు చివరి ఆయకట్టు వరకు చేరాయి. సమైక్య రాష్ట్రంలో ఏనాడు 45 నుంచి 50 వేల ఎకరాలకు మించి వరి పండించలేదు. కాళేశ్వరం నీళ్లు రావడంతో 2023 వరకు యాసంగిలో వందశాతం వరి పంట పండించారు. ఇప్పటికే చెరువులు, బావులు, బోర్లల్లో నీళ్లు లేకపోవడం, ఎస్సారెస్పీ కాలువల్లో ఇంకా ఒక్క విడత మాత్రమే నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో జిల్లాలోని 2.66 లక్షల ఎకరాలకు గాను 1.50 లక్షల ఎకరాలకు పైనే ఎండిపోవడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరం నుంచి చివరి ఆయకట్టు దాదాపు 340 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె, నడిగూడెం, మునగాల మండలాల్లో 42,796 ఎకరాలు ఉండగా సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని పెన్‌పహాడ్ మండలంలో 13,562 ఎకరాలు కలిపి మొత్తం చివరి నాలుగు మండలాల్లో 56,358 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ సీజన్‌లో నీరు రాకపోవ డంతో 30 వేల ఎకరాలు ఇప్పటికే ఎండిపోయింది.

### వట్టిపోతున్న గొలుసుకట్టు చెరువులు

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఆయకట్టేతర ప్రాంతం. ఎస్సారెస్పీ ప్రధాన కాలువతోపాటు వరద కాలువ ఈ మండలం మీదుగానే పోతున్నా, వివిధ గ్రామాలకు సాగునీరు అందడం లేదు. ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ నింపి, దాని ద్వారా ప్రధాన చెరువులు, గొలుసుకట్టి చెరువులను గత ప్రభుత్వం నింపి రైతులను అదుకున్నది. ఈ యేడాది వానకాలం నుంచే గంగాధర మండలంలోని మల్లాపూర్, వెంకంపల్లి, ఉప్పరమల్యాల, కురిక్యాల, కొండన్నపల్లి గ్రామాల రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. చెరువులన్నీ ఎండిపోయాయి. భూగర్భజలాలు అడుగంటిపోయాయి. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని పైప్‌లైన్ ద్వారా కొడిమ్యాల మండలానికి తరలించి తూతూమంత్రంగా చెరువులు నింపారే తప్ప, కొండాపూర్ చెరువు నుంచి నీటిని మల్లాపూర్ చెరువుకు తరలించలేదు. దీంతో మల్లాపూర్ చెరువుతోపాటు దాని దిగువన ఆధారపడిన గొలుసుకట్టు చెరువులన్నీ వట్టిపోయాయి. వేలాది ఎకరాల్లో పంట ప్రశ్నార్థకంగా మారిపోయింది.

## కళ తప్పిన కాలువలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోతున్నాయి. మొదటి దశలో సంగం మండలం తీగరాజుపల్లి, పర్వతగిరి, నెక్కొండ మీదుగా డీబీఎం 48 ద్వారా మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్, కురవి, డోర్నకల్ మండలం వెన్నారం వరకు గత ప్రభుత్వం సాగునీరు అందించింది. ప్రస్తుతం నీళ్లు రాకపోవడంతో ఈ ప్రాంతంలో వరి సగం పడిపోయింది. రెండో దశలోని డీబీఎం 60 ప్రధాన కాలువ తొర్రూరు మండలం నాంచారిమడూరు, పటేల్ గూడెం నుంచి మరిపెడ వరకు 45 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. 1,200 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా, 850 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నది. ప్రస్తుతం కాలువ కింద 8,000 ఎకరాలు సాగవుతున్నది. గతంలో 12 వేల ఎకరాల వరకు వరి సాగయ్యేది. ఈ 8 వేలల్లో ఇప్పటికే 2వేల ఎకరాల పంట ఎండిపోయింది. మరో 2,000 ఎకరాలకు నీరందని పరిస్థితి. డీబీఎం 57, 59 కాలువల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉన్నది.

